జోల పాడవమ్మా' అని ప్రక్కనే గదిలో భర్తతో పడుకున్న చిన్న తోటి కోడలు కేక వేసింది.

సుంగమ్మకి కోపమూ, రోషమూ, పెన వేసుకుపోయాయి. వీరయ్య యింకా పాపం పెరట్లో అలా నిలుచోవలసినదేనా?

పిల్లాడు ఏడుపు మానడే—

రెండు చేతులతోటీ శక్తికొద్దీ వాడి గొంతుక పిసికేసింది. నిమిషంలో పిల్లాడు ఏడ్పు మానేశాడు. సద్దుకాకుండా పెరట్లోకి వెళ్ళి వీరయ్యని కలుసుకొంది.

మళ్ళీ వచ్చిన తరువాత, పిల్లాడి మీద చెయ్యివేసి చూస్తే, ఊపిరి లేదు. కెవ్వున కేక వేసి, గొల్లుమంది.

# భయం

డాక్టర్ అంబాపతి యింకారాలేదు. శర్మా, మూర్తీ, రావూ, ముగ్గురూ అతనికోసం కనిపెట్టుకొని కూచున్నారు.

శర్మమాత్రం, తక్కిన ఇద్దరికంటె కొంచెం కళవళ పాటుపడుతూ వున్నట్టున్నాడు. మాటిమాటికీ తన చేతిగడియారం వంక చూస్తున్నాడు. మూర్తి తాపీగా చుట్ట కాలుస్తున్నాడు. రావు పత్రిక చదువుకుంటున్నాడు.

ఉన్నట్టుండి, "మనయెత్తు సరిగ్గా కొనసాగకపోతే, కొంప మునిగి పోతుంది" అన్నాడు శర్మ.

"మరేం భయంలేదు. చక్కగా కొనసాగుతుంది. కాని, నా భయమల్లా ఒక్కటే. చేతులారా మహాపాతకం చేస్తున్నామే అని!" అన్నాడు మూర్తి, చుట్ట కొనవున్న కొడిని క్రిందకురాలుస్తూ. పేపరు చుట్టచుట్టి, బల్లమీదపడవేసి, 'మరేం పాపంలేదు. వాడు చేసిన వెధవపనికి, మనం చేసేది ఒకశిక్ష అవుతుంది కాని, మనకి పాపం యేమీ చుట్టుకోదు" అన్నాడు రావు.

"అదుగో, బూటు చప్పుడు వినపడుతోంది, వస్తున్నట్టున్నాడు" అన్నాడు శర్మ.

మళ్లీ రావు పేపరు చేతిలోకి తీసుకున్నాడు. మూర్తి చుట్ట నోట్లో పెట్టాడు.

"హలో, ఆలస్యంగావచ్చాను కాబోసు" అంటూ, ముప్ఫయిసంవత్సరాల యువకుడు లోపలికి వచ్చాడు.

"ఏమీ ఆలస్యంలేదు. రండి" అని ఆ యువకుణ్ణి ఆహ్వానించాడు శర్మ.

"డాక్టరుగారికి. ఈమధ్య బొత్తిగా తీరుబాటు వుండటంలేదు" అంటూ, చుట్టను వరండాలోనికి విసిరివేశాడు మూర్తి.

"ఎలావుంటుంది. ఆంజనేయులు చనిపోయినప్పటినుంచీ, ఆ ప్రాక్టీసు కూడా వీరిదే అయింది. బొత్తిగా వూపిరిసలపని ప్రాక్టీసు అయింది", అంటూ, పేపరు మళ్ళీమడిచి, ఓమూలకి విసిరివేశాడు రావు.

'ఊపిరిసలపని ప్రాక్టీసు వున్నమాట వాస్తవమే కాని, దానికి తగినంత డబ్బు రాదండీ. తగినంతడబ్బుకూడా వుంటే, శ్రమపడుతున్నామని అనుకోనక్కరలేదు" అని, మందహాసంతో జవాబు చెప్పాడు డాక్టరు.

మూర్తీ, రావూ ఒకరిమొఖ మొకరు చూసుకున్నారు.

"నేను కాఫీ తీసుకువస్తాను" అని శర్మ లోపలికి వెళ్లాడు.

డాక్టరు అందంగావుంటాడు. మంచి ఖరీదైన సూటువేసుకున్నాడు. అతనివంక దీక్షగా చూస్తున్నాడు, మూర్తి.

రావు కొంచెంసేపు ఊరుకొని, "డాక్టరుగారూ, ఆత్మహత్యకు మంచి మార్గం ఏమిటండీ" అన్నాడు.

డాక్టరు వులికిపడి, "అలాటిప్రశ్నకు, ఏం సమాధానం చెప్పమంటారు. అసలు ఆత్మహత్యకూడునా అనేదే పెద్దమీమాంస" అన్నాడు, చిరునవ్వు తెచ్చిపెట్టుకొని.

"జీవితం దుర్ఘటమైనప్పుడు, ఆత్మహత్యచేసుకోక ఏం చేస్తాం! తప్పనిసరి అయినప్పుడు, ప్రాణం తీసుకోవాలంటే, బాధలేనిమార్గం ఏమిట్ల

ఆలోచన. డాక్టర్లు కదా మీకు తెలియకపోతుందా అని అడుగుతున్నాను''
అన్నాడు రావు.

"రావుకి ఎప్పుడూ, ఇలాంటి దౌర్భాగ్యపు ఆలోచనలే పుడుతూవుంటాయి''
అన్నాడు మూర్తి, నవ్వుతూ.

ఇంతలో శర్మ ఒకకప్పుతో కాఫీ తీసుకొనివచ్చి డాక్టరు ముందు పెట్టాడు. "అదేమిటి, మీరందరూనో!'' అని అడిగాడు డాక్టరు.

"మళ్ళీ వెళ్ళి తేవాలి. రెండేసి కప్పులు ఒక్కసారే తెస్తే ఒలికిపోతుందేమోనని ఒక్కొక్కటే తెస్తున్నాను'' అంటూ, శర్మ మళ్ళీ లోపలికి వెళ్ళాడు.

"మీరు తీసుకోండి'' అని, తనకప్పును రావుకు యివ్వబోయాడు డాక్టరు అంబాపతి.

"అబ్బే! మీ కిచ్చింది మీరే తీసుకోవాలి. మాకూ వొస్తుందిగా!''
అన్నాడు రావు.

ఇంతలో ఒకపళ్లెంలో మూడుకప్పులు పెట్టుకుని "మా ఆవిడకు యిప్పుడు ఆలోచన తట్టింది. పళ్లెంలో మూడు ఒక్కసారి పెట్టింది'' అంటూ శర్మ వచ్చాడు. రావు ఒకకప్పూ, మూర్తి ఒకకప్పూ తీసుకున్నారు. ఒకకప్పు తనకోసం టేబిలుమీద పెట్టుకొని, పళ్లెం లోపలపెట్టి తిరిగివచ్చి తనకుర్చీలో కూచున్నాడు శర్మ.

"కానివ్వండి'' అంటూ తనకప్పును పెదవుల దగ్గరకు పోనిచ్చాడు రావు. అందరూ తమతమ కాఫీని త్రాగివేశారు. శర్మ తనగడియారంవంక చూశాడు. "ఇంకా పదినిమిషాల వ్యవధివుంది. ఈలోపల డాక్టరుగారితో మాట్లాడేదాము'' అన్నాడు రావు.

"ఇంట్లోకి యెవ్వరిని రానివ్వవద్దని చెప్పివస్తాను'' అని శర్మ బైటకి వెళ్ళాడు.

"ఏమిటంత రహస్యం?''అని కొంచెం అనుమానపడ్డాడు డాక్టరు అంబాపతి. ఇంతలో శర్మ మళ్ళీ లోపలికివచ్చివేశాడు.

"ఏమిటా సంగతి చెప్పండి" అన్నాడు, డాక్టరు అంబాపతి శర్మ వైపు తిరిగి.

'చిత్తం. డాక్టరుగారూ, ఇప్పుడు మేము మీకు చెప్పబోయేది చాలా రహస్యం. అది మాకూ, మీకూ తప్ప మరెవరికీ తెలియదు. డాక్టరు ఆంజనేయులుకి నెలరోజుల నాడు జబ్బు చేసింది. ఈ వూళ్లో మీరు తప్ప మరొక డాక్టరు లేకపోవడం చేత, మిమ్మల్ని వైద్యానికి పిలిచాడు. మీరు వైద్యం ఆరంభించారు. అంతవరకూ బాగానే వుంది ఆ తరువాయి కథే—చాల అసహ్యంగానూ దారుణంగానూ పరిణమించింది. అదిగో, మీ ముఖం నల్లబడుతోంది. మీరు చేసిన పాపం మీకు తెలియదు కనుకనా! కుర్చీలోనుంచి లేవకండి. వీధితలుపులు తాళాలు వేయించాను. మీరు బయటికి వెళ్ళడానికి ఎంతమాత్రం వీలు దొరకదు. కూచోండి, ఆంజనేయులుగారి ఇంట్లో వైద్యం ప్రారంభించి మీరు చేసినపని ఏమిటంటే, వయసులో వున్న ఆయన భార్యను పాడుచెయ్యడం, ఆమెను మీవలలో చిక్కించుకోవడం.—మీరేం మాట్లాడవద్దు, నన్ను పూర్తిగా మాట్లాడనివ్వండి—మీరు పైకి చాలా అందంగా కనపడతారు. అంచేత ఆమె మీవలలో పడిపోయింది. తరువాత, మీరేం చేశారంటే—ఆంజనేయులు భార్యనూ, అతని ప్రాక్టీసునూ శాశ్వతంగా మీ చేత చిక్కించుకోవాలని చూశారు. దానికి ఒకటే మార్గం వుంది. అది ఆంజనేయులు చనిపోవడం. అంచేత, మందు అనే పేరుతో విషం పెట్టి అతన్ని క్రమంగా అంతమొందించేశారు. నిజంగా జబ్బులో వున్నాడు కనుక, అతని మరణం ఎవరికీ అనుమానం కలిగించలేదు. మీరు దర్జాగా ప్రపంచంలో చెలామణీ అయిపోతున్నారు. కాని, మీరు చేసిన గొప్పపనిని రహస్యంగా దాచుకోక, అంజనేయులు భార్యదగ్గర గొప్పగా చెప్పుకున్నారు. మీ యిద్దరిమాటలూ, మరొకరు విన్నారు. అది మాకు తెలియవచ్చింది. ఇప్పుడు మిమ్మల్ని ఏ కోర్టూ శిక్షించడానికి వీలులేదు. ఏమంటే, కోర్టులో నిలిచే సాక్ష్యమేమీ, ఇప్పుడు దొరకదు కనుక. కాని, మిమ్మల్ని ఇలా వదిలివేస్తే, ఇంకా ఎంతమందిని అంతమొందించి వేస్తారో. అందుచేత, మేము ముగ్గురం—మిమ్మల్ని అంతమొందించడానికి ప్లాను వేశాం.

"కాఫీకని పేరుపెట్టి పిలిచాం: కాఫీలో విషం కలిపి యిచ్చాము. దాని పేరేదో జ్ఞాపకంలేదుగాని, అదితిన్న పది నిమిషాలలో ప్రాణాలుపోతాయిట. మీకు ఇంకొక్కనిమిషం గడువుంది. ఈపాటికే మీతలలోనూ, పొట్టలోనూ మంట ఆరంభమయి వుండాలి" అని ముగించాడు శర్మ.

"ఆఁ" అని డాక్టరు లేవబోయాడు. గుండెలమీదనూ, పొట్టమీదనూ చెయ్యివేసి తడుముకోవడం ఆరంభించాడు. కొంచెం సేపటిలోనే అతని మొహం నల్లబడింది. మొహంమీద ముచ్చెమటలు పోశాయి. కుర్చీలో వుండగానే అతనితల ముందుకువంగి గుండెలమీద వ్రేల్లాడింది.

"అయిపోయింది" అన్నాడు శర్మ.

"కేవలం భయమూలాన అంత శీఘ్రంగా నిండుప్రాణం యెగిరిపోవడం నేను యిదివరకు యెప్పుడూ చూడలేదు" అన్నాడు రావు.

మూర్తి తల వెనక్కుతిప్పి "గుండెలుఆగి చనిపోయాడని పోలీసులకి కబురు పంపించు" అన్నాడు.

# కలికాలం

తెల్లవారుఝాము అయింది. కాకులు కూస్తున్నాయి. ఊరు అప్పుడప్పుడే నిద్ర మేల్కొంటున్నది.

కరణంగారి యింటిముందు మాత్రం అలికిడి కొంచెం ఎక్కువగా వున్నది గూడుకట్టిన రెండెడ్ల బండి గుమ్మంముందు నిలచివుంది. కమతగాడు, పెట్టెలు, ఏవేవో సామాను బండీలో పెడుతున్నాడు.

కరణం అరుగుమీద కూచుని మొహం కడుక్కుంటున్నాడు.

భార్య లోపలినుంచి బైటికివచ్చి "అమ్మాయి కనపడదేమండీ!" అన్నది.

"ఎక్కడికి వెళుతుంది, చూడు, నిద్దరలేచిందోలేదో" అన్నాడు కరణం.

"గంటసేపటినుంచీ వెతుకుతున్నాను, కనపడలేదండీ. పిల్లవాడు పక్కమీదనే వున్నాడు. అమ్మాయిమాత్రం కనపడదు." అన్నది కరణం భార్య.